క్లుప్తంగా

బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ మానస

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం జిల్లెగడ్డ, మీర్జాపూర్ గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఎంపీపీ లకావత్ మానస ఆదివారం పరిశీలించారు. వార్షాలు కురవక ముందే బ్రిడ్జి పూర్తి చేయాలని సూచించారు. వార్షాలు పడితే పనులకు ఆటంకం కలుగుతుందని, వరదలు వస్తే రెండు గ్రామాల రవాణాకు ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేస్తే రెండు గ్రామాల ప్రజలతో పాటు కేశ్వాపూర్, గొల్లపల్లి, మల్లంపల్లి గ్రామాల ప్రజలు హన్మకొండకు వెళ్లేందుకు దూర భారం తగ్గుతుందన్నారు. వీరి వెంట సర్పంచ్ లావుడ్య స్వరూప తదితరులు ఉన్నారు.

ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని రాజగోపాల్‌పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం పాలిసెట్, ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. మొదటిరోజు ఎంసెట్‌లో 161 మంది విద్యార్థులు, పాలిసెట్‌లో 43 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు తెలిపారు. వారి సర్టిఫికెట్లు పరిశీలించినట్లు తెలిపారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న రజకులు, నాయకులు

సిద్దిపేటకమాన్: రజకుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి అన్నారు. కులవృత్తి చేసుకునే రజకులకు ఉచిత కరెంట్, రూ.లక్ష ఆర్థికసాయం అందించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో దోబీ సేవల టెండర్ అవకాశం రజకులకు మాత్రమే కల్పించినందుకు సిద్దిపేట పట్టణంలోని లాల్‌కమాన్ వద్ద సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు రజకులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ భూముల్లో అక్రమ తవ్వకాలు నిలిపివేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ భూముల్లో అక్రమంగా తవ్వుతున్న మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులతో కలసి ఆలయ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వామివారి భూములు కాపాడాల్సిన ఆలయ ఈవో, పాలకమండలి చైర్మన్‌తో కలసి ఆలయ సంపదను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఆలయ భూముల్లోని విలువైన మట్టిని రోడ్డు కాంట్రాక్టర్‌ను తవ్వుకోమ్మని పరోక్షంగా లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. గతంలో గ్రామ అవసరాల కోసం ఆలయ భూముల్లో గ్రామ పంచాయతీ అధికారులు మట్టితీస్తే కేసులు పెట్టిన ఆలయ ఈవో ప్రస్తుతం పట్టించుకోకవడంతో విషయం అర్థమవుతుందని తెలిపారు. మట్టితవ్వకాలు వెంటనే నిలిపివేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బద్దిపడగ కృష్ణారెడ్డి, సనాది భాస్కర్, మేకల కృపాకర్, యాదయ్య, ఆరుట్ల దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలను విస్మరించిన బీఆర్‌ఎస్

చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్‌ఎస్ పాలనలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌లు విమర్శించారు. ఆదివారం చిన్నకోడూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ఏ ఒక్క పేదోడు సంతోషంగా లేడన్నారు. నిరుపేదలను బీఆర్‌ఎస్ విస్మరించిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, ప్రస్తుతం బీఆర్‌ఎస్ మునిగిపోతున్న పడవ అన్నారు. ఖమ్మంలో నిర్వహించే సభను అడుగడుగునా అడ్డుకునే కుట్రలు చేస్తుందన్నారు. పోలీసులు బీఆర్‌ఎస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, పరశురాములు, జయంత్‌లు ఉన్నారు.

ఒక గది..45 మంది విద్యార్థులు

- చెట్ల కింద, వరండాలో బోధన
- అదనపు తరగతి గది నిర్మించాలని వేడుకోలు


వరండాలో కూర్చున్న విద్యార్థులు


ఒకే తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లు కనీస వసతులు సమకూర్చకుండా.. పాఠశాలల్లో చిన్న చిన్న మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అక్కన్నపేట మండలంలోని మంచినీళ్లబండ గ్రామ ప్రాథమిక పాఠశాలల్లో 5 తరగతులకు ఒకే గది ఉండడంతో ఉపాధ్యాయులు చెట్లకింద, వరండాలో పాఠాలు బోధిస్తున్నారు.

- మండలంలోని మంచినీళ్లబండ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కేవలం ఒకటే తరగతి ఉంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 45 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. కానీ గతంలో ఇక్కడా రెండు తరగతి గదులు ఉండగా అందులో ఒకటి పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుకోవడంతో కూల్చేశారు.
- మరో గదిలో అక్కడక్కడా పాక్షికంగా దెబ్బతింది. దీంతో ఇటీవల మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా అదనపు తరగతి గది నిర్మాణానికి దాదాపు రూ.11.70లక్షలు మంజూరయ్యాయి.
- ఆదేవిధంగా పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద సుమారుగా రూ.17లక్షల వరకు మంజూరయ్యాయి.
- కానీ మన ఊరు–మన బడి కింద పాక్షికంగా దెబ్బతిన్న తరగతి గదులకు మరమ్మతులు చేసి రంగులు వేశారు.
- అదనపు తరగతి గది నిర్మాణం, ప్రహరీ నిర్మాణానికి ఇంకా ఎవరూ ముందుకు రావడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.
- దీంతో ఒకే గదిలో పాఠాలు బోధించడం ఇబ్బందిగా మారిందని, తద్వారా చెట్ల కింద, వరండాల్లో పాఠాలు చెబుతున్నామన్నారు.
- సరైన తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతోందన్నారు.
- నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు తాము సిద్ధంగా ఉన్న తరగతి గదులు లేవన్నారు.
- ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దృష్టి సారించి అదనపు తరగతి గది త్వరగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కష్టసుఖాల్లో అండగా ఉంటా

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి


అర్జున్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గ ప్రజల కష్ట, సుఖాల్లో నిరంతరం అండగా ఉంటానని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అనారోగ్యంతో బాధపడుతున్న దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట మాజీ సర్పంచ్ అర్జున్‌రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఏ ఆపద వచ్చిన తన దృష్టికి తీసుకొస్తే అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. ఎన్నికల ముందు ఇష్టం వచ్చినట్లుగా హామీలు ఇచ్చి గెలిచిన రఘునందన్‌రావు నియోజకవర్గానికి కేంద్రం నుంచి నయాపైసా నిధులు తెచ్చి అభివృద్ధి చేసిందిలేదన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చురుకుగా చేపడుతున్నామన్నారు. ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ బక్కి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ సత్యనారాయణ

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాల్లో జరిగే నేరాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని చేర్యాల సీఐ సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని లద్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నారాయణగౌడ్, సర్పంచ్ జీడికంటి సుదర్శన్, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఉపసర్పంచ్ బెడద కుమారస్వామి, వార్డుసభ్యులు అన్నోజు పుష్పంజలిశ్రీనివాస్‌చారి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి సోగాల మనోజ్‌కుమార్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నంద శ్రీను, రైతుబంధు కో–ఆర్డినేటర్ దండు సోమయ్య, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ కాసర్ల కనకరాజు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రభాకర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం


తీగలకుంటపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


సిర్సనగండ్లలో..

కోహెడరూరల్(హుస్నాబాద్): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీదే అధికారమని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి, కోహెడ మండల అల్పకాలిక విస్తారక్ గోవిందరాజు అన్నారు. మండలంలోని తీగలకుంటపల్లి, గోట్లమిట్ల, నారాయణపూర్, విజయనగర్ కాలనీ, వెంకటేశ్వరపల్లి గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, సర్పంచ్ మ్యాకల చంద్రశేఖర్‌రెడ్డిలతో కలసి ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ ప్రధాని మోదీ అమలుచేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో గుగ్గిళ్ల శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, రమణారెడ్డి, రాజిరెడ్డి, శ్రీశైలం, బాపురెడ్డి, సంపత్, రాజు, మహేశ్ ఉన్నారు.

సిర్సనగండ్లలో..

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడ, కొండపాక, దమ్మక్కపల్లి, సిర్సనగండ్ల, మేదినీపూర్ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలపై బీజేపీ మండల అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి నందన్‌గౌడ్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం బీజేపీ పనిచేస్తుందన్నారు. ప్రధాని మోదీ పాలనను ప్రపంచ దేశాలు అభినందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నందాల శ్రీనివాస్, నాయకులు సురేశ్, మనోహర్, గంగయ్య, గౌరారం కృష్ణ, ఉపేందర్, బాలకృష్ణ, శేరి నరేందర్, బాబు పాల్గొన్నారు.

మార్కెట్ పాలకవర్గానికి అభినందన


మార్కెట్ పాలకవర్గంతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల నియామకమైన చేర్యాల మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అభినందించారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులను శాలువాలను కప్పి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, డైరెక్టర్లు కృష్ణాగౌడ్, రాములుగౌడ్, బుచ్చిరాములు, సత్యనారాయణ, రామరాజుగౌడ్, రాజేశం, ఆగమల్లు, రాజు, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళి


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): గుండెపోటుతో మృతి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమ కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్‌కు బీఆర్‌ఎస్ నాయకులు అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చిట్టాపూర్ సర్పంచ్ పోతనక రాజయ్య, బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, బీఆర్‌ఎస్‌వీ దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు పాపనిసురేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, నాయకులు కైలాసం, పంజాల శ్రీనివాస్‌గౌడ్, ర్యాకం శ్రీరాములు, బోయ శ్రీనివాస్, కృష్ణ, దుబ్బరాజం, మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

దుబ్బాకరూరల్: మండలంలోని అచ్చుమాయిపల్లి గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యం


ఎల్‌ఓసీ అందిస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పేద ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మునిగడప గ్రామానికి చెందిన సంతోష్ అనారోగ్యానికి గురికాగా అతనికి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని ఆయన అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీ కిరణ్‌గౌడ్, నాయకులు హరిగౌడ్, రవి, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అండగా..


చిన్నారులకు నోట్‌బుక్స్ అందిస్తున్న ఎంపీటీసీ తదితరులు

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని బండారుపల్లిలో అనారోగ్యంతో ఇటీవల లింగంపల్లి భూపాల్ లత దంపతులు మృతి చెందారు. దీంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. ఆ ముగ్గురు పిల్లలకు తాము అండగా ఉంటామని ఎంపీటీసీ సుమలతకనకయ్య, ఉపసర్పంచ్ రమేశ్‌లు భరోసా కల్పించారు. చిన్నారుల చదువుల నిమిత్తం ఆదివారం నోటుబుక్స్, ఇతర స్టేషనరీ అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, పరమేశ్వర్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి


మంత్రి హరీశ్‌రావుకు సమస్యలు విన్నవిస్తున్న యాదగిరి

గజ్వేల్‌రూరల్: గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి సహకరించాలని నాచారం దేవస్థాన పాలక మండలి మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక విలేకరులతో కొట్టాల యాదగిరి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల త్రిశక్తి(పెద్దమ్మ, నల్లపోచమ్మ, మహంకాళమ్మ) ఆలయ నిర్మాణంలో భాగంగా ఫ్లోరింగ్, గ్రానైట్‌తో పాటు తూప్రాన్‌లోని శ్రీరాంనగర్‌లో నిర్మిస్తున్న ముదిరాజ్‌ల కులదైవమైన పెద్దమ్మతల్లి ఆలయానికి ఫ్లోరింగ్‌తో పాటు గ్రానైట్ ఏర్పాటుకు సహకరించాలని మంత్రి హరీశ్‌రావుకు విన్నవించగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అదే విధంగా గజ్వేల్‌లో తుదిదశలో ఉన్న ముదిరాజ్ ఫంక్షన్‌హాల్‌కు నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీనివాస్, కృష్ణ, దేవేందర్, వెంకటేశం, మల్లేశం,నాగేశ్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలో నూతనంగా బాలుర వసతి గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ ఎంపీటీసీలు మంచాల అనసూయ, ఆరుట్ల లక్ష్మిలు ఆదివారం మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఇదివరకు బాలుర వసతి గృహం శిథిలావస్థలోకి చేరడంతో అద్దె భవనంలో నెలకు రూ.26వేలను చెల్లిస్తూ కొనసాగిస్తున్నారన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. యజమాని వసతి గృహాన్ని ఖాళీ చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారన్నారు. నిధులు మంజూరు చేయించి మోడల్ బాలుర వసతి గృహాన్ని నిర్మించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


నగదు, బియ్యం అందజేస్తున్న స్నేహితులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణానికి చెందిన మిడిదొడ్డి భిక్షపతి ఇటీవల కిడ్నీ సమస్యతో మృతి చెందాడు. భిక్షపతి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న 96–97లో కలిసి చదువుకున్న పదో తరగతి స్నేహితులు రూ.20వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యం ఆదివారం అందజేశారు. పిల్లల చదువుకు సహకరిస్తామని భరోసా కల్పించి ఆ కుటుంబానికి మరోధైర్యం కల్పించారు.

‘ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదు’


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

హుస్నాబాద్: కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ కార్యాలయాలు తెచ్చామని ఎన్నికల స్టంట్ కోసమే మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి చెత్త జీవోలు తెచ్చి ప్రజలను మోసం చేశాడని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనిలు విమర్శించారు. ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి అవాక్కులు, చెవాక్కులతో గాలి మాటలు మాట్లాడుతున్నాడని తెలిపారు. అప్పుడున్న గౌరవెల్లి ప్రాజెక్ట్ 1.14 టీఎంసీల సామర్థ్యం సరిపోదని, సీఎం కేసీఆర్ 8.23 సామర్థ్యానికి పెంచి, నాలుగు సంవత్సరాల్లో ప్రాజెక్టును పూర్తి చేయించిన ఘనత ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ హయాంలో గతుకుల రోడ్లపై వరినాట్లు వేసే పరిస్థితి ఉండేదన్నారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను విమర్శించే స్థాయి ప్రవీణ్‌రెడ్డికి లేదని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ కొంకట నళినీదేవి, కో–ఆప్షన్ సభ్యుడు అయూబ్, నాయకులు కొంకట రవి, చిరంజీవి, బోజు రవి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ధరల పెంపుతో సామాన్యులపై భారం

మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో


నిరసన తెలుపుతున్న నాయకులు

సిద్దిపేటకమాన్: నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పెరిగిన కూరగాయల ధరలను నిరసిస్తూ సిద్దిపేట పట్టణంలోని బస్టాండ్ వద్ద మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ప్రజలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో చంద్రం, సతీశ్‌గౌడ్, ఇమామ్, మధు, స్వప్న, రమ, రజిత, నర్సవ్వ, లలిత, భాగ్యలక్ష్మి, శ్యామల తదితరులు పాల్గొన్నారు

బీఆర్‌ఎస్ బూత్ కమిటీల ఎన్నిక


కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాక పట్టణంలోని 12వ వార్డులో బీఆర్‌ఎస్ 43వ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బూత్ అధ్యక్షుడిగా బట్టు చిన్న ఎల్లం, సోషల్ మీడియా అధ్యక్షుడిగా పర్స స్వామి, యూత్ అధ్యక్షుడిగా నాయిని యాదగిరి, బీసీ అధ్యక్షుడిగా రెడ్డబోయిన మల్లేశం, రైతు విభాగం అధ్యక్షుడిగా బట్టు బాలయ్య, మైనార్టీ అధ్యక్షుడిగా చాంద్‌పాష, మహిళా అధ్యక్షురాలిగా మ్యాదరి అరుణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాదమ్మ ఎల్లం, నాయకులు భూంరెడ్డి, బండి రాజు, నరేశ్, అఖిల్, చందు, బాలు, చంద్రకాంత్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీని సన్మానించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

దుబ్బాక: బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని జిల్లా బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 14, 15 వార్డుల్లో బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా 15 వార్డులోని 38వ బూత్ అధ్యక్షుడిగా మంతూరి చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా 14 వార్డులోని 42వ బూత్ అధ్యక్షుడిగా ఎల్లారం చంద్రశేఖర్, సోషల్ మీడియా అధ్యక్షుడిగా శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆస యాదగిరి, మీనరామస్వామిగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులున్నారు.

న్యాయవాదులు సామాజిక బాధ్యతతో మెలగాలి


అశోక్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

బెజ్జంకి(సిద్దిపేట): న్యాయవాదులు సామాజిక బాధ్యతతో మెలగాలని ప్రభుత్వ మాజీ ఫీడర్ (మాజీ జీపీ) సీనియర్ న్యాయవాది పిన్నింటి అశోక్ సూచించారు. బెజ్జంకిలో ఆదివారం బెజ్జంకి, గన్నేరువరం మండలాల న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అనేక సమస్యలపై ప్రజలు న్యాయవాదులను ఆశ్రయిస్తారని, వారి జీవితాలతో ముడిపడిన వృత్తి కావడంతో న్యాయవాదులు అంకితభావంతో పని చేయాలన్నారు. ఈతరం న్యాయవాదులు రాబోయే కొత్తతరానికి చేయూతనివ్వాలన్నారు. అనంతరం న్యాయవాదులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కేసీ మూర్తి, జక్కనపెల్లి గణేశ్, బొనగిరి మహేందర్, స్వామి, లింగాల శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.